# చంద్రబాబుకు బ్రహ్మరథం

చోడవరం రూరల్, డిసెంబరు 20 (న్యూస్‌టుడే): ఏరువాకలో భాగంగా చోడవరం పర్యటనకు వచ్చిన తెదేపా అధినేత చంద్రబాబుకు ప్రజలు, పార్టీశ్రేణులు బ్రహ్మరథం పట్టారు. గురువారం రాత్రి 11.30 గంటలకు మండలంలోని గాంధీగ్రామంకు చేరుకున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ పప్పల చలపతిరావు, తెదేపా జిల్లా అధ్యక్షుడు బండారు సత్యనారాయణ మూర్తి బాబు వెంట ఉన్నారు. బాణసంచా కాల్పులు, నేల వేషాలు, కోబ్రాడ్యాన్స్, కోలాటాలతో సందడి సందడిగా రోడ్‌షో కొనసాగింది. ఎనిమిదేళ్ల తరువాత చోడవరం మండలానికి విచ్చేసిన బాబును చూసేందుకు పిల్లలు, పెద్దలూ అందరూ ఆసక్తి కనబరిచారు. రాత్రి 12.15 గంటలకు కొత్తూరు జంక్షనుకు చేరుకున్న బాబు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అక్కడ నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గంటా కొత్తగా నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన తర్వాత ఉత్తమ జర్నలిస్టులకు ఎమ్మెల్యే గంటా తండ్రి స్మారకార్థం అవార్డులు పంపిణీ చేశారు. మండలంలోని గవరవరంలో నిర్మించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు.



అధ్యక్షోపన్యాసం చేస్తున్న ఎమ్మెల్యే గంటా

## రైతులకు బాసటగా పోరాటాలు

బుచ్చెయ్యపేట: రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని ఆపేది లేదని తెదేపా రాష్ట్ర అధ్యక్షులు చంద్రబాబునాయుడు అన్నారు. ఏరువాక పర్యటనలో భాగంగా గురువారం రాత్రి వడ్డాది విచ్చేసిన ఆయన ప్రచార రథంపై నుంచి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాత్రి 11 గంటలకు వడ్డాది చేరుకున్నారు. అప్పటి వరకు ఆయన రాక కోసం ప్రజలు ఓపికపట్టి నిరీక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. ఏ రంగంలోనైనా వస్తువు తయారుచేసిన ఉత్పత్తిదారుడే దానికి ధర నిర్ణయించి అమ్ముకుంటారు. కాని అన్నదాతలు పండించిన పంటను వారు అమ్ముకోకుండా ఆంక్షలు విధిస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌ను కలిసి వినతిపత్రాలు అందించాం. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. రైతులకు న్యాయం జరగాలని అనేకచోట్ల ఉద్యమాలు, రైతు గర్జనలు నిర్వహిస్తున్నామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే సహకార రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామన్నారు. చిన్న సన్నకారు రైతులకు 10 పైసలకే వడ్డీకి రుణాలు మంజూరు చేస్తాం. ఉచిత విద్యుత్తుపై హామీనివ్వడంతో ప్రజలు పెద్దపెట్టున హర్షధ్వానాలు పలికారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ దేశం పార్టీ హయాంలో అభివృద్ధి జరిగిందన్నారు. ఎం.పి. పప్పల చలపతిరావు, పార్టీ జిల్లా అధ్యక్షులు బండారు సత్యనారాయణ, ఎంపిపి బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు.



కార్యకర్తల నేలవేషాలు

## పార్టీలో 200 మంది చేరిక

దేవరాపల్లి మండలం ఎన్.గజపతినగరం గ్రామానికి చెందిన 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పార్టీ నుంచి తెదేపాలో చేరారు. చంద్రబాబు సమక్షంలో వారు పార్టీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. చంద్రబాబు వారిని అభినందించి సాదరంగా ఆహ్వానించారు. పుప్పాల అప్పలరాజు చంద్రబాబుకు జ్ఞాపికకు అందజేశారు.

## తెలుగువాడి గుండె చప్పుడే దేశం పార్టీ : గంటా

రావికమతం: తెలుగువాడి గుండె చప్పుడే తెలుగుదేశం పార్టీ అని చోడవరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొత్తకోటలో గురువారం రాత్రి జరిగిన చంద్రబాబు బహిరంగసభలో ఎమ్మెల్యే గంటా అధ్యక్షోపన్యాసం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని రాష్ట్ర ప్రతిష్ఠను వివిధ దేశాలకు చాటి చెప్పారని చెప్పారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా అధికారుల్ని గ్రామాలకు పంపి ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని సమస్యలు పరిష్కరించి గ్రామాల్ని అభివృద్ధిపరిచారన్నారు. ప్రతిపక్ష నాయకుని గా రాజశేఖరరెడ్డి ప్రజలకు కపట వాగ్దానాలు చేశారని, హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో అన్యాయాలు, అక్రమాలు, కుట్రలతో నిండిపోయిందని దుయ్యబట్టారు. చెరకు మద్దతు ధరకోసం షుగర్ రైతులు రోడ్డెక్కినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనను అంతమొందించాలని రానున్న ఎన్నికల్లో దేశం పార్టీకి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.